# దళితుల, ఇతర పీడిత ప్రజల హక్కుల కాలరాచివేత

**2018** మార్చి 20న జస్టిస్ ఏకె గోయల్, జస్టిస్ యు.యు.లలిత్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం 'యస్‌సి, యస్‌టి అత్యాచార(నిరోధక) చట్టం-1989' క్రింద విచారణ చేసిన ఓ కేసులో తీర్పునిచ్చింది. తరతరాలుగా దళితులపై సాగుతున్న దాడులు, దౌర్జన్యాలు, నేరాలను సమర్ధవంతంగా నిరోధించే చట్టబద్ధ రక్షణలకోసం దశాబ్దాలుగా సాగిస్తున్న పోరాటంపై ఈ తీర్పు ఓ గొడ్డలివేటు వేసింది.

యస్‌సి, యస్‌టి అత్యాచార(నిరోధక) చట్టం లోని 18వ సెక్షన్‌ను సవరించాల్సిందిగా ఆదేశిస్తూ అందుకు కొన్ని మార్గదర్శకాలను, సూచనలను చేయటంతోపాటుగా ఆ తీర్పులో కొన్ని పరిశీలనలను కూడా పేర్కొన్నారు:

"1. ఈ కేసు మోపబడిన ఏ ప్రభుత్వ ఉద్యోగస్థుడినైనా అరెస్ట్ చేయటానికి ముందుగా ఆ ఉద్యోగిని నియమించిన అధికారినుండి పోలీసులు వ్రాతపూర్వక అనుమతి పొందాలి. ప్రైవేటు ఉద్యోగుల విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయటానికి ముందుగా డిఎస్‌పి స్థాయి అధికారి ప్రాధమిక విచారణ చేపట్టి, ఈ కేసు పైచట్టంలోని నిబంధనలకు లోబడివుందా లేదా ఉద్దేశ్యపూర్వకంగా బనాయించిందా అనేది పరిశీలించాలి.

2. పై చట్టం కులోన్మాద అత్యాచారాలకు శిక్షలు విధించటంతోపాటుగా, అనుమానితులైన నిందితులు లేదా ముద్దాయిలకు ముందస్తు బెయిల్‌ను కూడా నిరాకరిస్తుంది. కనుక ఫిర్యాదులో నిందితుడుగా ఈ కేసు మోపబడిన వ్యక్తియొక్క స్వేచ్ఛను ఈ చట్టం దాదాపు ఏకపక్షంగా హరించి వేస్తున్నది.......నిందితుడు తనపై మోపబడిన కేసు కల్పితమైనదని ప్రాధమిక ఆధారాలను రుజవు చేసుకోగలిగితే, అతనికి ముందస్తు బెయిల్ ఇచ్చితీరాలి.

కోర్టు ఆదేశాలనుండి ఏమాత్రం వైదొలిగినా, ఆటోమేటిక్‌గా అది సుప్రీంకోర్టు ధిక్కరణ క్రిందకే వస్తుంది.

3. పై చట్టం క్రింద గత మూడు దశాబ్దాలుగా చేసిన ఫిర్యాదులు సమాజంలో పీడిత విభాగాలు వారి "ప్రతీకారం" తీర్చుకోవడానికి, స్వార్ధ ప్రయోజనాలను సంతృప్తిపరచుకోవడానికి ఉపయో గించబడ్డాయి.

4. కుల రేఖలను చెరిపివేయడానికి బదులు, ఈ చట్టం కులద్వేషాన్ని పెంచే తప్పుడు కేసులకు ఉపయోగించబడుతోంది. ప్రస్తుతం 'అత్యాచార నిరోధక చట్టం' పని తీరు కులతత్వాన్ని పెంపొందిస్తుందేమో అన్నట్లుగా వుంది. "కుల ప్రాతిపదికపై అమాయక పౌరులను తప్పుడు కేసుల్లో ఇరికించటాన్ని" కట్టడి చేయటానికి కోర్టు జోక్యం అవసరమౌతోంది.

5. అమాయక పౌరులను నిందితులుగా పేర్కొంటున్నారు.... వ్యక్తిగత ప్రతీకారం తీర్చుకోవటానికి లేదా బెదిరించటానికి సాధనంగా అత్యాచార నిరోధక చట్టాన్ని ఉపయోగించరాదని చట్టం నిర్దేశిస్తోంది.

6. కులం, మతంతో నిమిత్తం లేకుండా పౌరులపై ఓ దుర్మార్గుడు లేదా ఓ పోలీసు అధికారి కల్పిత కారణాలతో దోపిడీ, అణచివేతలను ప్రయోగించే రాజశాసనంగా ఈ చట్టం మారరాదు. అలా మారితే అది రాజ్యాంగ గ్యారంటీలకు విరుద్ధమౌతుంది. ఈ కోర్టు అలాంటి గ్యారంటీలను కల్పించి తీరుతుంది. కులద్వేషాలకు చట్టం తోడ్పడరాదు.

ఈ చట్టం క్రింద కేసులో ఇరికించబడ తామేమోననే భయంచేత ఉద్యోగుల చెడు లక్షణాల గురించి చెప్పటం ప్రభుత్వాధికారులకు కష్టంగా మారుతోంది".

పై ఆదేశాలు, మార్గదర్శకాలు, పరిశీలనలు ఈ చట్టంయొక్క స్పష్టమైన వ్యాఖ్యంగా తేటతెల్ల మౌతున్నాయి. ఈ చట్టం ఎలా అమలు చేయబడుతోంది, అత్యాచారాలకు, నేరాలకు గురైన బాధితులు ఏవిధంగా ఈ చట్టాన్ని ఉపయోగించు కుంటున్నారో లేదా దుర్వినియోగం చేస్తున్నారో అనేదే చర్చనీయాంశం. సుప్రీంకోర్టు వ్యాఖ్యానాలు, పరిశీలనలు సంపూర్ణంగా పనికిమాలినవి. ఈ చట్టం స్ఫూర్తికి, లక్ష్యానికి వ్యతిరేక భావాలతో గాఢంగా ప్రభావితుడైన ఓ రాజకీయ నాయకుని మాటల లాగా ఇవి తోస్తున్నాయి. న్యాయమూర్తులు తమ ముందుకొచ్చిన సంబంధిత కేసుకు పరిమితమై, ఆ కేసులో నిర్దిష్ట అంశాలను పరిశీలించి తమ తీర్పు వెలువరించటానికి పరిమితంకాకుండా, విధానరూపకర్తల స్థాయికి తమను తాము ఉన్నతీకరించుకొని, తమ ప్రతీఘాతుక మనస్తత్వాన్ని వెల్లడి చేసుకున్నారు.

దళితులు తమ హక్కులను నొక్కిచెప్పి నప్పుడల్లా స్వార్ధపరశక్తులు వారిని భీతావహుల్ని చేయటానికి ప్రయత్నిస్తున్నాయని 1989 చట్టం లక్ష్యాలు - కారణాల ప్రకటనలో పేర్కొనబడింది. దళితులు తమ జీవితాలలో ఎదుర్కొనే నేరాల ప్రత్యేక స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొని నిందితులకు ముందస్తు బెయిల్ మంజూరు హక్కును ఈ చట్టం మినహాయించింది. నిందితులకు ముందస్తు బెయిల్ మంజూరు చేసేవిధంగా ఈ చట్టంలోని 18వ సెక్షన్‌ను సవరించాలని సుప్రీంకోర్టు ఆదేశించే టప్పుడు, సామాజిక వాస్తవాలను అదేవిధంగా దళిత ప్రజానీకపు అనుభవాలను సులభంగా ప్రక్కన బెట్టింది. ఈ కేసు మోపబడిన ఓ ప్రభుత్వోద్యోగిని అరెస్టు చేయాలంటే, అతనిని నియమించిన అధికారి నుండి ముందస్తుగా వ్రాతపూర్వక అనుమతి తీసుకోవాలని; అదే ఓ ప్రైవేటు ఉద్యోగిపై ఈ కేసు మోపబడితే, డిఎస్‌పి ప్రాధమిక విచారణ తర్వాతే అతనిని అరెస్టు చేయాలని కోర్టు ఆదేశించటం -1989 చట్టంయొక్క మౌలిక స్ఫూర్తికీ, ప్రయోజనానికే విరుద్ధమైనది. కులపీడిత ప్రస్తుత సమాజంలో దళితుడైన లేదా ఎస్‌టికి చెందిన పేద కష్టజీవికి, చప్రాసీకి, గుమాస్తాకి లేదా ఉద్యోగికి తమపై జరిగిన దౌర్జన్యానికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయటమేగాక, కేసు నమోదు చేయటానికి ఉన్నతాధికారులనుండి వ్రాతపూర్వక అనుమతి కోరి, దానిని పొందగలగటం - చాలా కష్టసాధ్యమనే

విషయం న్యాయమూర్తులకు తెలియదని భావించలేం. అదేవిధంగా, దళితులపై, షెడ్యూల్డు జాతులపై నేరాలకు, అత్యాచారాలకు పాల్పడుతున్న లేదా దాడులు చేసే వారిని రక్షిస్తున్న దోపిడీ పాలకవర్గాలతో ప్రత్యక్షంగా కుమ్మక్కు అయిన నిర్బంధ యంత్రాంగమున్న మనదేశంలో, పోలీసు అధికారుల నిశిత పరిశీలన తర్వాత దళితుల ఫిర్యాదుకు ఏ గతి పదుతుందో అర్థంచేసుకోవటం కష్టమేమీకాదు.

ప్రజల నిరంతరాయ వేదనలు, వారి పోరాటాల ఫలితంగానే దళితుల, ఇతర అణగారిన వర్గాల ప్రజల హక్కులను, జీవితాలను రక్షించేపేరిట మనదేశంలో అనేక చట్టాలు ఉనికిలోకి వచ్చాయి. 1955లో అంటరానితనాన్ని నిషేధిస్తూ చట్టం వచ్చింది. పౌరహక్కుల పరిరక్షణచట్టం-1976గా దీనిపేరు మార్చారు. అయితే, ఆపై 13 సంవత్సరాల కాలం జరిగిన తర్వాత కూడా "యస్‌సి, యస్‌టిల సామాజిక ఆర్థిక పరిస్థితులను మెరుగు పరిచే అనేక చర్యల తర్వాత కూడా, వారి పరిస్థితి ఇంకా దయనీయంగా, దుర్బలంగా వుంద"ని పాలకులు అంగీకరించారు. "వారు అనేక పౌర హక్కులు పొందలేకున్నారు. వారు అనేక అవమానాలకు, హేళనలకు, వేధింపులకు గురవు తున్నారు. వారిపై అనేక దాడులు జరుగుతున్నాయి. కనుక వారిపై జరిగే నేరాలను అరికట్టటానికి, నిరోధించటానికి ఒక ప్రత్యేక చట్టం అవసర మౌతోంది" అని పేర్కొన్నారు. ఫలితంగా యస్‌సి, యస్‌టి అత్యాచార(నిరోధక) చట్టం 1989లో ఉనికిలోకి వచ్చింది. తిరిగి 2015లో దళితులపై దాడులకు, అఘాయిత్యాలకు పాల్పడుతోన్న కులోన్మాదులకు శిక్షవిధించే అంశాలు కొన్నింటిని చేరుస్తూ, అలాగే నిందితులకు ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ, ఈ చట్టానికి సవరణలు చేశారు. ఈ సవరణలద్వారా తల జుట్టు లేదా మీసాలను క్షవరం చేయటం లేదా ఆ తరహా చర్యలు యస్‌సి, యస్‌టి ప్రజల గౌరవానికి భంగం కలిగించేవిగా, అఘాయిత్యాలుగా పరిగణిస్తూ ఆ చట్టాన్ని మరింత పకడ్బందీగా, కఠినతరంగా మార్చారు.

చట్టాల చరిత్రను పరిశీలిస్తే రెండు అంశాలు స్పష్టమౌతాయి. 1. దళితులు, ఇతర పీడిత ప్రజానీకం తమ హక్కులను గుర్తించే లేదా పరిరక్షించే ఒక చట్టం ఉన్నదా, లేదా అనే దానితో నిమిత్తం లేకుండా దోపిడీ వర్గాలకు, రాజ్యానికి, అగ్ర కులోన్మాదశక్తులకు వ్యతిరేకంగా పోరాడవలసిందే. 2. దళితులపై దాడులకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా మరింత కఠినతరమైన చట్టాలను ఒక దాని తర్వాత మరొకటి చేయవలసి వస్తున్నదంటే, జరుగుతున్న అత్యాచారాలను ఈ చట్టాలు ఏమాత్రం ఆపలేకపోగా, అవి మరింత తీవ్రతరమౌతున్నాయని, దళితులు, పీడిత ప్రజానీకం తమ పోరాటాన్ని కొనసాగించి తీరాలని తెలియజెప్తున్నాయి.

జాతీయ నేర నమోదు సంస్థ(ఎన్‌సిఆర్‌బి) చేసిన సర్వే ప్రకారం, దళితులపై దేశవ్యాపితంగా ప్రతి 15 నిముషాలకొక నేరం జరుగుతున్నది. ప్రతిరోజూ ఆరుగురు దళిత మహిళలు లైంగిక అత్యాచారాలకు గురవుతున్నారు. గత 10 సం॥ల కాలంలో (2007-2017) దళితులపై సాగుతున్న నేరాలలో 66 శాతం పెరుగుదల కన్పిస్తోంది. రాజకీయాధికారం, అదేవిధంగా అగ్రకులోన్మాద శక్తులైన భూస్వాముల చేతుల్లో వివిధ రూపాల్లో అవమానాలకు, అత్యాచారాలకు, హంతకదాడులకు గురైన బాధిత దళితుల్లో కొద్దిమంది మాత్రమే, తమపై నేరం జరిగిందని పోలీస్ కేసు పెట్టగలుగు తున్నారనేది అందరి దృష్టిలోవున్న విషయమే. తమపై దాడులు, అత్యాచారాలు జరిగినా దళితులలో అత్యధికులు పోలీసుస్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేయటానికి సైతం తీవ్రంగా భయపడతారు. ఫిర్యాదు చేస్తే అగ్రకులోన్మాదులు తిరిగి తమపై మరింత ఘోరంగా దాడులు చేయటమో, నిర్బంధానికి గురిచేయటమో చేస్తారనే భయంతో ఫిర్యాదు చేయటానికే సాహసించరు. అదేవిధంగా, దళితులపై దాడుల కేసులను పోలీస్ స్టేషన్‌లలో నమోదు చేసుకోకుండా, చెత్తబుట్టలో వేయటమో లేక ఫిర్యాదిదారుల చేతనే ఆ కేసులు ఉపసంహరించుకునేలా వత్తిడి చేయటమో జరిగిన సంఘటనలు అనేకం మన కళ్ళెదుటే వున్నాయి. దీనిని దాటుకొని ఒకవేళ కేసు నమోదు చేసినా, న్యాయస్థానాల్లో విచారణ తతంగమంతా నడిచి, తీర్పు ఇచ్చే దశకు చేరుకునే నాటికి, ఆ కేసును అన్నివిధాలా నీరుగారుస్తారు. బలహీన ఆర్థిక నేపథ్యమున్న ఫిర్యాదిదారుడు, అత్యాచారాలకు పాల్పడేవారు - సంపూర్ణంగా అసమానులుగా వున్నారు. దళితులపై అత్యాచారాల కేసులలో 90శాతం - బాధితులను దీనావస్థలో మిగిల్చి, నిందితులందర్నీ నిర్దోషులుగా ప్రకటిస్తూ విడుదల చేసే కోర్టు తీర్పులతో ముగియటం మనందరకూ తెలిసిందే.

కనుక, దళితులు అదేవిధంగా పేదప్రజానీకం ఈ చట్టాన్ని దుర్వినియోగంచేయటం అలా వుంచి, ఉపయోగించుకోవటంలోనే తమ తీవ్ర అశక్తత అనే సమస్యను ఎదుర్కొంటుండగా, న్యాయమూర్తులు మాత్రం ఈ చట్టం దుర్వినియోగం చేయబడుతోందని చెబుతున్నారు. అయితే, సంపన్న ఆధిపత్య వర్గాలకే ఆవిధంగా చేసే అవకాశం మెండుగా వుంది. వారు చట్టాన్ని ఉపయోగించుకోగలరు, దుర్వినియోగం చేయగలరు; ఉల్లంఘించగలరు లేదా పక్కన పెట్టగలరు లేదా దోపిడీ, అణచివేతలకు గురయ్యే అత్యధిక ప్రజానీకానికి వ్యతిరేకంగా తమ స్వీయ ప్రయోజనాలకోసం ఏ చట్టాన్నైనా తమ కనుకూలంగా మలచుకోగలరు. అనేక చట్టాలలోని అంశాలు(భూసంస్కరణల చట్టాలతో సహా) ప్రజాను కూలమైనవని చెబుతారు. దీర్ఘకాల ప్రజాపోరాటాల ఫలితంగా ముందుకొచ్చిన ఈ చట్టాలను, రూపొందించిన నాటినుండే చిత్తు కాగితాలుగా మిగిల్చి వేశారు. అయితే, దోపిడీ అణచివేతలకు గురయ్యే ప్రజానీకపు అశాంతి, నిరసన పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయటానికి మాత్రం రాజ్యానికి, ఆధిపత్యవర్గాలకు అవసరమైన ప్రతిసందర్భంలోనూ మాత్రం నిర్దిష్ట చట్టాల కోరలు పదునుతేలి, శక్తివంతంగా విజృంభిస్తాయి.

### దేశవ్యాప్త నిరసన

ప్రజలు పోరాటంద్వారా సాధించుకున్న, ఏదో మేరకున్న చట్టపర రక్షణలన్నింటినీ ఎత్తివేయాలని కోరుతూ సుప్రీంకోర్టు 2018 మార్చి 20న ఇచ్చిన తీర్పు సంచలనం కలిగించింది. కాగా, ప్రజా పోరాటాలను కట్టడి చేయాలని కృషిచేస్తోన్న శక్తుల నైతికధృతి పెంచటానికి తోడ్పడింది. చాలా సహజంగానే, ప్రజానీకం దేశవ్యాపితంగా ఈ తీర్పును వ్యతిరేకిస్తూ శక్తివంతమైన, విస్తృతమైన

నిరసన చేపట్టారు. ఈ నేపధ్యంలోనే 2018 ఏప్రిల్ 2న భారత్‌బంద్ నిర్వహించారు. యుపి, ఎంపి, గుజరాత్, మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్, తెలంగాణా, ఏపి మరియు ఇతర రాష్ట్రాలలో వేలాదిమంది దళిత, పీడిత ప్రజానీకం వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పలు ప్రాంతాలలో పాఠశాలలు మూతబడ్డాయి; రైలుబండ్ల రాకపోకలు స్థంభించాయి; రహదార్లు దిగ్బంధించ బడ్డాయి; దుకాణాలు, వ్యాపార సంస్థలను మూసి వేశారు; పలుచోట్ల నిరసనకారులు పోలీసులతో ఘర్షణపడ్డారు. వివిధ రాష్ట్రాలలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వాలు అంతర్జాల సేవలను నిలిపివేశాయి; 144వ సెక్షన్ విధించాయి; భారీ సంఖ్యలో భద్రతా బలగాలను మోహరించాయి; వందలాదిమంది నిరసనకారులను అరెస్టు చేశాయి; భాష్పవాయుగోళాలు ప్రయోగించాయి; పోలీసులు పలుప్రాంతాల్లో జరిపిన కాల్పులలో 9 మంది మరణించారు.

బిఎస్‌పి కుట్రగా పేర్కొంటూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ ఆందోళనను కొట్టేయ బూనుకుంది. అయితే, ఈ నిరసనకున్న విస్తృత స్వభావంతో, దళిత, పీడిత ప్రజలనుండి తాను ఒంటరిఅవుతున్నామనే భయం బిజెపికి పట్టుకుంది. నష్టనివారణ చర్యలలో భాగంగా బిజెపి ప్రభుత్వం ఆలస్యంగా, అర్ధమనస్కంగానైనా తీర్పును సమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని ఆలోచన చేసింది.

**సమీక్షా పిటీషన్ ఘట్టం**

కేంద్రప్రభుత్వం 2018 ఏప్రిల్ 2న సుప్రీంకోర్టులో దాఖలు చేసిన సమీక్షా పిటిషన్ ద్వారా ఆటోమేటిక్ అరెస్టులను, ఈ చట్టం క్రింద నేరాల నమోదుకు విధించిన ఆంక్షలను రద్దుచేస్తూ స్టే విధించవలసిందిగా కోరింది. ఈ తీర్పు 'విస్తృత నిరసనాందోళనలను రగిలించిన' నేపధ్యంలో ఈ తీర్పును నిలుపుదల చేసి వుంచాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. అయితే, "వీధుల్లో నిరసనలు తెలిపేవారు మా తీర్పును కనీసంగా చదివి కూడా వుండక పోవచ్చు. కొందరు స్వార్ధప్రయోజనపరులైన వారిచే వారు తప్పుదోవపట్టించబడుతున్నారు. కనుక మేము వీటిని పరిగణలోకి తీసుకోలేము" అని ప్రకటిస్తూ సుప్రీంకోర్టు ఈ విజ్ఞప్తులను తోసి పుచ్చింది. 1989 చట్టం దుర్వినియోగం గురించి పేర్కొంటూ కోర్టుతీర్పులో ఇచ్చిన నిర్దిష్టభాగాలను తొలగించాలన్న ప్రభుత్వ విన్నపాన్ని తిరస్కరిస్తూ యస్‌సిలు, యస్‌టిలు చట్టాన్ని దుర్వినియోగ పరుస్తున్నారన్నది తమ దృష్టికాదని; ప్రభుత్వం సమర్పించిన గణాంకాలే దీనిని సూచిస్తున్నాయని సుప్రీంకోర్టు ఆసక్తికరమైన వాదనలు చేసింది. 1989 చట్టం గురించి నిందాపూర్వక ప్రభుత్వ దృక్పధంపై 2018 మార్చి 20 నాటి సుప్రీంకోర్టు తీర్పు ఆధారపడివుందని," వివరాలు, సమాచారం ప్రభుత్వమే అందించి, విన్నపాలు సమర్పించి ఇప్పుడు వారే తీర్పును సవాలుచేస్తున్నారు" అని కోర్టు ఆదేశం మేరకు తన అభిప్రాయం వివరించే న్యాయనిపుణుడు వ్యాఖ్యానించాడు. ఈ చట్టంక్రింద తప్పుడు అరెస్టులు చేయటం, దుర్వినియోగం చేయటంపై కోర్టు మార్గదర్శకాలను రూపొందించాల్సి రావటానికి ప్రభుత్వం కోర్టు ముందుంచిన నివేదికే నిర్ణయాత్మక కారణంగా వుందని జస్టిస్ గోయెల్ ఎత్తిచూపాడు. ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రివ్యూ పిటీషన్ ఘట్టం(ఇంకా పూర్తికాలేదు) రెండు విషయాలను ముందుకుతెస్తోంది. ఒకటి- కేంద్రప్రభుత్వమూ మరియు ఉన్నత న్యాయ స్థానమూ రెండూ 1989 చట్టాన్ని నీరుగార్చి, నిరుపయోగం చేయదలచుకున్నాయి. 2018 మార్చి 20 నాటి తీర్పు రూపంలో సుప్రీంకోర్టు ఒక ఆలోచన అందించింది. న్యాయమూర్తుల వక్కాణింపులన్నీ ఈ అంశాన్ని స్పష్టంచేస్తున్నాయి. రెండు - ఊహించనివిధంగా, న్యాయమూర్తుల తీర్పుకు వ్యతిరేకంగా భారీ వ్యతిరేకత, నిరసన వ్యక్తమైంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక వైపుకు నెట్టబడ్డట్లుగా భావించింది. సుప్రీంకోర్టు తీర్పు కలిగించిన రాజకీయ నష్టంనుండి తాను తప్పించుకోవటానికి, ఆ తీర్పుకు తనకూ ఏమీ సంబంధం లేదని బిజెపి చెప్పుకోవలసివచ్చింది. కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌కూడా అందులో భాగమే. 1989 చట్టాన్ని నిలిపివుంచటానికి ప్రభుత్వం దాఖలు చేసిన తన రివ్యూ పిటిషన్‌లోనూ, న్యాయస్థానంలో చేసిన వాదనలలలోనూ కనబరిచిన వినయ విధేయతలన్నీ, కులవ్యవస్థను, సంబంధిత వివక్ష, అసమానత్వం, అణచివేతలను రూపుమాపే లక్ష్యంపట్ల అంకితభావ మేమాత్రం వారికి లేదని తేటతెల్లం చేస్తున్నది.

**గ్రహించాల్సిన కొన్ని విషయాలు**

1. సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యహక్కులు మొదలైన వాటన్నింటినీ వాగ్దానం చేస్తున్న భారత రాజ్యాంగం వర్గ విభజిత సమాజంపై ఆధారపడి, దానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. వ్యక్తిగత ప్రైవేటు ఆస్తిని, విదేశీ ఆస్థులను పవిత్రమైనవిగా అనుల్లంఘనీయ మైనవిగా ఎత్తిపడ్తోంది. గత ఏడు దశాబ్దాల కాలంలో ఆస్తిహక్కు, సమాజంలో ఊహించలేనంతగా ఆర్థిక, సామాజిక, రాజకీయ అంతరాలు పెంచివేయటానికి తోడ్పడింది. అతికొద్దిమందిగా వున్న అత్యధిక సంపన్నులను ఒకవైపు, అత్యధికులైన అతిపేదలను మరొకవైపున నిలిపింది. అత్యంత సంపన్నవర్గాలను అధికార కిరీటాలతో, ఉన్నత స్థానాలలో నిలిపి, వనరులన్నీ వారికే కల్పించి, భారతరాజ్యాంగం, చట్టం, ఆస్తిపై హక్కు పేరు చెబుతూనే తమ చిత్త మొచ్చినరీతిలో పేద, బలహీన వర్గాల ప్రజానీకపు జీవనపు ప్రతిపార్శ్వాన్నీ నిరంకుశంగా బలిచేసింది. అదేవిధంగా అత్యంత సంపన్న వర్గాలు, మరియు వారిచే అదుపు చేయబడే సంస్థలన్నీ అధికార కేంద్రాలుగా వుంటూ, ప్రతి ప్రజాస్వామిక వ్యవస్థనూ, వాటి నిర్వహణనూ, హక్కులనూ తామే నిర్దేశిస్తూ, నియంత్రిస్తూ, అదుపుచేస్తూ, అణచివేస్తూ వస్తున్నాయి. మొత్తంమీద ప్రజానీకం ప్రజాస్వామిక హక్కులను, స్వేచ్ఛలను ఏ మేరకు, ఏ పద్ధతిలో ఉపయోగించుకోవాలో వారే నిర్ణయించగలుగు తున్నారు. రాజ్యం, చట్టసభలు, న్యాయవ్యవస్థ, పోలీసు, ఉన్నతాధికార యంత్రాంగం, ప్రసార, ప్రచార మాధ్యమాలు మొదలైన ఈ సమాజపు స్థంభాలన్నీ స్వతంత్రంగా ఉన్నట్లుగా కనపడు తున్నప్పటికీ, వాస్తవానికి ఆధిపత్యవర్గాల ప్రయోజనాలకనుగుణంగా వ్యవహరిస్తూ, వారికి సేవచేస్తూ, వారి అదుపాజ్ఞలలో నడుచు కుంటున్నాయి.

మన ప్రజలు ఒక స్వతంత్ర, ప్రజాస్వామిక ఆర్థిక రాజకీయ స్వాతంత్ర్యంకోసం పోరాడారు. అయితే, భారత రాజ్యాంగంలో వాగ్దానం చేసిన హక్కులు, రక్షణలకోసం ప్రయత్నించిన ప్రతిసారీ అత్యధికంగానున్న ప్రజానీకం క్రూరమైన అణచి వేతకు గురిచేయబడుతూ వస్తున్నారు. ఆధిపత్య వర్గాల అధికారానికి వ్యతిరేకంగా న్యాయస్థానాల లోనూ ప్రధానంగా వీధుల్లోనూ తీవ్రమైన పోరాటాలు సాగించటం ద్వారానే తమ కనీసపాటి హక్కులనైనా వారు నిలుపుకోగలిగారు. సమాజంలోని ప్రభుత్వం, ధనికవర్గాలు, అధికార రాజకీయశక్తులకు వ్యతిరేకంగా పేదప్రజలు పోరాడటం మరింత కష్టతరమౌతోంది.

దళితులకు, పీడిత ప్రజానీకానికి భారత రాజ్యాంగం కల్పించిందని నమ్ముతున్న రక్షణలు లేదా హక్కులు అమలుకావాలన్నా లేదా కాపాడు కోవాలన్నా, సమాజంలో నిజమైన ప్రజాస్వామిక, సామాజిక, రాజకీయ వ్యవస్థ నెలకొనాల్సిన అవసరాన్ని గ్రహించాలి. అంతదాకా, తమ హక్కుల సాధనకు, రక్షణకు చేసే పోరాటాలు బలహీనంగా, అనిర్దిష్టంగా, ఆధారపడలేనివిగా వుంటాయనే స్పృహను కలిగివుండాలి. కనుక, ప్రజలహక్కుల కోసం, స్వేచ్ఛకోసం సాగించే పోరాటం, భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీల నుండి విముక్తి పొందే ఒక నూతన సమాజంకోసం జరిపే పోరాటంతో తప్పనిసరిగా అనుసంధానించబడాలి.

2. ప్రస్తుత సమాజంలో ప్రజలహక్కుల పరిరక్షణకోసం హామీ ఇచ్చే ఏ చట్టాలైనా, ప్రజా పోరాటాల ఫలితంగా రూపొందినవే. ప్రజా పోరాటాల వత్తిడితోనే పాలకులు ఈ చట్టాలను రూపొందించి, ప్రజాపోరాటాలను పురోగమించ నీయకుండా అడ్డుకొని, నీరుగార్చటానికే వీటిని ఉద్దేశించారు. ఆచరణలో ఈ చట్టాలను చిత్తు కాగితాలుగా మార్చి, ప్రజలు తమ హక్కులను వినియోగించుకునే మార్గంలో ఎన్నో ఆటంకాలను కల్పించారు. ప్రజలు తమ చొరవతో సంఘటితశక్తితో ఐక్యపోరాటాలు సాగించటం ద్వారానే తమ హక్కులను, చట్టపర రక్షణలను ఏదో మేరకు పొందగలుగుతారనేది అనుభవం తెల్పుతున్నది. కనుక, వారు చట్టపర రక్షణలకోసం పోరాడటంతో పాటు, వాటి అమలుకోసం కూడా పోరాడాలి. అయితే, అదే సందర్భంలో, వారు ఎక్కువగా వానిపై ఆశలు పెట్టుకోవటం, తమ స్వీయచైతన్యాన్ని, సంఘటిత, ఐక్యపోరాటాలను బలహీనపరచగలదు.

3. దళితులు, ఆదివాసీలు, ఇతర పీడిత ప్రజానీకం 1989 చట్టం కల్పించిన చట్టపరమైన రక్షణలను నీరుగార్చే లేదా ఎత్తివేసే ప్రతి ప్రయత్నానికీ వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగించాలి. 1989 చట్టాన్ని నీరుగార్చేవిధంగా, నిరుపయోగం చేసేవిధంగా మార్చి 20వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని ఆదేశాలను సంపూర్తిగా ఉపసంహరించుకునేవరకు వారు పోరాడాలి. హిందూమతతత్వ, తిరోగమన, ప్రతీఘాతుకశక్తులు అధికారంలో కొనసాగుతూన్న ప్రస్తుత పరిస్థితులలో, అగ్రకులోన్మాదశక్తులు, ధోరణులు జీవితంలోని ప్రతిపార్శ్వంలోనూ ముందుకు చొచ్చుకొనివస్తున్న ఈ పరిస్థితులలో, ఈ ధోరణులకు, శక్తులకు, పాలకవర్గ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరాయంగా, నిర్ణయాత్మకంగా సాగించే పోరాటం మాత్రమే మనదేశంలోని దోపిడీకి, అణచివేతకు గురయ్యే పీడిత ప్రజలకు మార్గంగా నిలుస్తుంది.

ooooo